ఓం నారాయణ - ఆదినారాయణ

# అవధూత లీల

## అధ్యాయము - 27

## శ్రీస్వామివారికి అతిప్రీతిపాత్రమైన పని అందరూ చేసి తరించండి



అసంఖ్యాకమైన బాధ గురువులలో నిజమైన సద్గురుని గుర్తించడం చాలా గొప్ప విషయం. అలా గుర్తించాక వారి స్థితిని అవగాహన చేసుకొనడం, అంచనా వేయడం సామాన్యమైన విషయంగాదు. అలా వారి స్థితిని గుర్తించాక వారి మాటయందు **అచంచల విశ్వాసం గల్గి పూర్ణంగా ఆచరించగల్గాలంటే మనలో పూర్ణ భక్తిశ్రద్ధలు ఉంటేగానీ ఆచరించలేము. వారి మాట ఆచరించకుంటే ఫలితం శూన్యం. అట్టి భక్తి శ్రద్ధలు మనలో** 124
**కల్గాలంటే వారి సన్నిధి - సేవల వలన వారి అనుగ్రహంతో మాత్రమే మనకట్టి శుభ సంస్కారములు కల్గును.** ప్రత్యక్ష సన్నిధి లభించనప్పుడు వారి జీవిత చరిత్ర పారాయణే వారి సన్నిధితో సమానము. ఆ విధంగా వారి ప్రత్యక్ష సన్నిధి సేవలుగానీ, వారి జీవిత చరిత్ర పారాయణగానీ చేసే శక్తి మనకెలా కల్గుతుంది? పుణ్యకర్మల ప్రభావం మన పాపకర్మల ప్రభావము కంటే అధికముగా నున్నప్పుడు మాత్రమే దైవాన్ని నియమ నిష్ఠలతో అనన్యంగా శరణువేడగలము (భగవద్గీత). అలాంటి పుణ్యకర్మలేవి? దేవ, ద్విజ, గురు, ప్రాజ్ఞపూజనం, భగవన్నామస్మరణ.

కనుక దైవకృప పొందాలంటే పూజ, నామస్మరణల కెంతైనా ప్రాధాన్యత ఉన్నది. కనుకనే శ్రీ వెంకయ్యస్వామి వారెప్పుడూ భజన, నామ సంకీర్తనలను ప్రోత్సహించేవారు. 'ఓం నారాయణ ఆదినారాయణ' అనే నామాన్ని తంబుర మీటుతూ గంటల తరబడి శ్రవణానందంగా గానం చేసేవారు.

తమ దర్శనార్థం వచ్చినవారిని "భజన చేసుకోండయ్యా" అని చెప్పి భక్తులు భజన చేస్తుంటే శ్రీస్వామివారు శ్రద్ధగా వింటూ కూర్చుని వారి భక్తి శ్రద్ధలననుసరించి వారిననుగ్రహించేవారు.

అప్పుడప్పుడూ భక్తులు పాడే భజన, కీర్తనలు ఆపి "ఓం నారాయణ

ఆదినారాయణ” అనే మంత్రాన్ని గానం చేయించేవారు.

హృదయపూర్వకంగా ప్రేమతో భగవన్నామాన్ని గానం చేయడం, భజన చేయడం శ్రీస్వామివారికెంతో ప్రీతి. అలా చేయబడుచున్న భజన కార్యక్రమములను శ్రద్ధతో ఆలకించి ఆశీర్వదించేవారు.

ఒకరోజు బొంతరాజుపాళెంలో భక్తులంతా కాళ్ళకు గజ్జెలు ధరించి చెక్క పలకలు చేతబూని చాలా ఉత్సాహంగా అడుగులు వేస్తూ భంగిమలు చేస్తూ కోలాహలంగా చెక్కభజన చేస్తున్నారు. ప్రేక్షకులంతా భగవంతుని స్మరించడం మరచిపోయి ‘ఎవరు బాగా అడుగేస్తున్నారు. ఎవరు చక్కగా భంగిమలు ప్రదర్శిస్తున్నార’నే విమర్శలో ఉన్నారు. కీర్తనకారుల సంగతి చెప్పనక్కరలేదు. వారి దృష్టంతా ప్రేక్షకుల నాకర్షించడంలో కేంద్రీకృతమయింది.

కొంత సేపయ్యాక శ్రీస్వామివారు అమాయకంగా “ఏందయ్యా వాళ్ళు చేసేది?” అని పెద్దగా నవ్వేశారు. శ్రీస్వామివారలా ఎందుకన్నారో మనందరికీ చక్కగా తెలిసిపోయింది. గనుక హృదయస్పందనతో, ఆర్తితో భజన, నామసంకీర్తన చేసి మనందరం శ్రీస్వామివారి కృపకు పాత్రులవుదాం.

ఒకరోజు ఒక భక్తుడు “స్వామీ! మీకు మా గ్రామంలో మందిరం కట్టిస్తాము. అక్కడ ఉండి అందరినీ అనుగ్రహించండి” అని అర్థించాడు. శ్రీస్వామివారు అన్నారు “ఒక్కరేముందయ్యా కట్టించేది. వెంకయ్య చాటుకు పోయాక ప్రతి ఊళ్ళో కట్టించుకుంటుళ్ళా” అని శెలవిచ్చారు.

కనుక ప్రతి గ్రామములోను కనీసం ఒక్కరిద్దరైనా సరే మొదట శ్రీస్వామివారి పటం ఆ గ్రామంలోని ఏ దేవాలయంలోనైనా పెట్టుకొని కడ్డీలు వెలిగించి శ్రీస్వామివారి చరిత్రలోని కనీసం నాలుగు లీలలు చదివి, “ఓం నారాయణ ఆదినారాయణ” మంత్రం భజన చేసి తరువాత శ్రీస్వామివారి భజనలు పాడుకోవడం ఎంతో శ్రేయస్కరం.

మహాత్ముల చరిత్ర పారాయణ మనలను తరింపచేయటమే గాక గ్రామానికంతకూ మేలు చేకూరుస్తుంది. శ్రీస్వామివారి అండ ఆశీస్సులు ఆ గ్రామంలో ప్రతివారికి లభింపజేస్తుంది. అనావృష్టి అరిష్టాల ప్రభావము తగ్గటం, సామూహిక వ్యాధుల నుండి రక్షణ తప్పక కల్గును. మొదట ఒకరిద్దరితో మొదలు పెట్టినా రానురాను శ్రీస్వామివారి కృపవలన ఆ భజన బృందం

అభివృద్ధి చెంది ప్రతివారికి శ్రీస్వామివారి కృప అనుభవమవుతుంది. ఒక వారం రోజులలో మరణించే పరీక్షిత్తునకు శుకయోగి శ్రవణం చేయించినది మహనీయుల చరిత్రే. అదే భాగవతం.

అయితే మొదట ఆరంభించడమే కష్టము. శ్రమ అనుకోకుండా బిడియపడకుండా ఒక్కరిద్దరైనా మొదలుపెట్టి చేస్తుంటే తదుపరి శ్రీస్వామివారే తమ కార్యం నెరవేర్చుకుంటారు.

**ఆ విధంగా చేసి శ్రీస్వామివారి కృప ఆ గ్రామానికంతటికీ లభించేలా**
**చేసిన వారి కృషే నిజమైన నిష్కామకర్మ. వారమునకొక రోజు చేయడం** 125
**కాకుండా నిత్యం చేయడం ఎంతో మేలు. మానవజన్మ సఫలం చేసుకునే పద్ధతే ఇది అని నా స్వానుభవం తెలుపుతుంది.**

